క్లుప్తంగా

తాగునీటి బోర్ల పరిశీలన



క్రిష్టాపురంలో బోరును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్

కోడుమూరు రూరల్: మండలంలోని క్రిష్టాపురం గ్రామంలో తాగునీటి బోర్లు, ట్యాంకులు, పైప్‌లైన్లను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ పరిశీలించారు. నీటి సరఫరాపై సిబ్బందితో చర్చించారు. వర్షాలు పడుతున్న దృష్ట్యా ప్రతి 15 రోజులకోసారి ట్యాంకును తప్పనిసరిగా శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన తర్వాతనే ప్రజలకు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నీటి పైపులైన్లకు ఎక్కడా లీకేజీలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యం



వేసవి శిబిరంలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): క్రమం తప్పకుండా యోగా చేస్తే ఆరోగ్యంతో పాటు ఆనందం కలుగుతుందని జాతీయ యోగా సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నగరపాలక సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న వేసవి యోగ శిక్షణ శిబిరం ముగిసింది. విద్యార్థులు యోగా సాధన ద్వారా ఒత్తిడిని అధిగమించి చదువులో రాణిస్తారన్నారు. తర్వాత చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దిల్షాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 14వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన



బ్రెడ్ తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం: మండల కేంద్రంలోని పొదుపు కార్యాలయంలో స్వయం ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్నట్లు ఏపీఎం ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎస్‌ఆర్‌ఎల్‌ఏఎం నుంచి వచ్చిన నీరజ్‌తో వివిధ రకాల ఆహార పదార్థాల తయారీపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు, చిన్న తరహా పరిశ్రమలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో బాబురావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మవ్వకు బోనాల సమర్పణ



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న రజకులు

గూడూరు రూరల్: పట్టణంలో మంగళవారం గంగమ్మవ్వ ఉత్సవాలను రజకులు ఘనంగా నిర్వహించారు. గూడూరు నగర కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాల నడుమ బోనాలను ఊరేగింపుగా కుమ్మరి కుంట వద్ద వెలసిన గంగమ్మ గుడికి తీసుకెళ్లారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, శేషన్న, సురేష్, అశోక్, రమేష్, రాజు, డోన్ చిన్న, లింగన్న, ఎర్రన్న, నాగరాజు, రామదాసు, శ్యామన్న, మాధమ్మ పాల్గొన్నారు.

మలేరియా కేసు నమోదు

దేవనకొండ: మండలంలోని నెల్లిబండ గ్రామంలో మలేరియా కేసును గుర్తించినట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలోని రంగస్వామి అనే వ్యక్తికి మలేరియాతో బాధపడుతున్నట్లు గుర్తించి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. బాధితుడి ఇంటి పరిసరాలను మంగళవారం పరిశీలించి డీడీటీ మందును పిచికారీ చేయించారు. వర్షాలు కురుస్తున్నందువల్ల సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బంది చేత స్ప్రే చేయిస్తామన్నారు. అనంతరం మలేరియా, చికున్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

అప్రమత్తతే రక్ష

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు
- తీగలు, పెట్టెల మరమ్మతులు తప్పనిసరి
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణానికే ముప్పు
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట





వ్యవసాయం పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ పెట్టె, గనిలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన బర్రె (ఫైల్)

గడివేముల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రైతులు పంటలకు నీరు పెట్టానికి వెళ్లి పొరపాటున విద్యుత్ షాక్‌కు గురయ్యే ఆస్కారం ఉంది. కొందరు బోర్లు, మోటార్లకు మరమ్మతు చేసే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, కిందకు వేలాడుతున్న వైర్ల వల్ల కొన్ని ప్రమాదాలు జరిగాయి. ఇళ్ల వద్ద, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో విద్యుత్, బోరుబావులు, వాగుల వద్ద విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి పంటలు సాగు చేస్తున్నారు. విద్యుత్ వినియోగంలో ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈదురుగాలులు ఎక్కువగా వీచే అవకాశాలు ఉండడంతో రైతులు, పొలాల్లోకి జీవాలను మేత కోసం తోలుకు వెళ్లేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గడివేముల విద్యుత్ శాఖ ఏఈ ఖలీల్ పాషా రైతులకు సూచిస్తున్నారు.

ప్రమాదాలు ఇలా..

వర్షకాలంలో ఈదురుగాలులతో విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోయి కరెంటు సరఫరా అవుతుండడంతో పశువులు, ప్రజలు షాక్‌తో మృతి చెందుతున్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లినప్పుడు అక్కడ సరైన వైరింగ్ లేక ఏమరుపాటుతో ప్రమాదాల బారిన పడుతున్నారు. డిస్ట్రిబ్యూషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమతి లేకుండా ఫ్యూజులు మార్చే సందర్భంలో కరెంటు సరఫరా కావడంతో పలువురు చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. సర్వీస్ వైర్లు, వీధి దీపాలను సరిచేసేందుకు విద్యుత్ స్తంభాలు ఎక్కినప్పుడు కరెంటు సరఫరా జరిగి మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విద్యుత్ పనులు సొంతంగా చేసుకోరాదు.
- తడి చేతితో విద్యుత్ పరికరాలు ముట్టుకోకూడదు.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే కరెంటు ఉండదని మరమ్మతులు చేయకూడదు.
- మోటార్లను నేలపై కాకుండా గద్దెలపై ఏర్పాటు చేయాలి. స్టార్టర్ బోర్డును తడవకుండా చూడాలి.
- మోటారు పాడైతే మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి. సొంతగా ప్రయత్నించవద్దు.
- స్టార్టర్ వైర్లు నేల మీద ఉంచకూడదు. స్టార్టర్‌పై మూత తీసి వాడకూడదు.
- సర్వీసు వైర్లను, మోటార్లకు వాడే తీగలు నాణ్యమైనవి వాడాలి. అతుకులు లేకుండా చూసుకోవాలి.
- సబ్ మెర్సిబుల్ మోటారుతో పాటు విద్యుత్ వైర్ ఉంటుంది. ఏ కొంచం వైర్లు తెగి ఉన్నా, మోటార్ నుంచి పైన ఉండే వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంటుంది.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి పొడవైన ప్లాస్టిక్ పైపు, కర్రతో వ్యక్తిని తప్పించాలి. తగిన వైద్య సహాయం అందించాలి.

మూడింటికే పరిహారం

విద్యుత్ సంస్థలు కేవలం మూడు రకాల ప్రమాదాలకు మాత్రమే నష్టపరిహారం అందిస్తాయి. మనుషులు, పశువులు మరణిస్తే సాయం అందుతుంది. గాయాలకు పరిహారం ఉండదు. మనుషులకు అయితే రూ.5 లక్షలు, పశువులకైతే రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.7 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారు. ఏదైనా ప్రమాదం జరిగిన స్థలంలోని చిత్రం, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. పశువులకైతే ఫొటోతో పాటు పశు వైద్యుడి పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందించాల్సి ఉంటుంది.

నష్టపరిహారం ఇలా

- ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి పడినప్పుడు వాటికి తగిలి మనుషులు, పశువులు మరణిస్తే నష్ట పరిహారం ఇస్తారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు వాటికి తగిలి చనిపోతే నష్టపరిహారం అందుతుంది.
- తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడితే నష్ట పరిహారం ఇస్తారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతి ఒక్కరూ విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి. పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాల బారిన పడకుండా విద్యుత్‌శాఖాధికారులు చెబుతున్న జాగ్రత్తలు పాటించాలి. తీగలు తెగిపడినట్లు గుర్తిస్తే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలి. రైతులు సర్టిఫైడ్ ఎలక్ట్రీషన్లతోనే విద్యుత్ పనులు చేయించుకోవాలి. ఆన్, ఆఫ్ స్విచ్లు వేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

– ఖలీల్ పాషా, విద్యుత్ శాఖ ఏఈ, గడివేముల

భగవద్గీతతో మానసిక ప్రశాంతత



భగవద్గీతపై అవగాహన కల్పిస్తున్న సమితి సభ్యులు

ఓర్వకల్లు: మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంత జీవనం గడపడానికి భగవద్గీతను చదవడం అలవాటు చేసుకోవాలని మిడుతూరుకు చెందిన ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. మండలంలోని హెచ్ కొట్టాల, చెన్నశెట్టిపల్లె గ్రామాల్లో మంగళవారం ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. సమితి సభ్యులు శ్రీనివాసులు, రాఘవేంద్ర, రవి, గోకారి, జగదీష్, సుజాత, హైమావతి, సుబ్బలక్ష్మి, రమణమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామం వద్ద ఉన్న మోడల్ స్కూల్లో 2024–24 సంవత్సరానికి 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షామీల తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ 7వ తరగతిలో ఏడు సీట్లు ఖాళీ ఉండగా రిజర్వేషన్ పరంగా ఈడబ్ల్యూఎస్ బాలికలకు– 3 సీట్లు, ఎస్సీ జనరల్–1, ఎస్టీ బాలికలకు –1, బీసీ– ఈ బాలికలకు –1, పీహెచ్ బాలికలకు –1, అలాగే 8వ తరగతిలో 6 సీట్లు ఖాళీ ఉండగా రిజర్వేషన్ పరంగా ఓసీ జనరల్–1, బీసీ–డి జనరల్ –1, బీసీ–ఈ జనరల్ –1, ఎస్సీ బాలికలకు –1, ఎస్టీ జనరల్ –1, పీహెచ్ జనరల్ –1 ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 18వ తేదీన మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి రిజర్వేషన్ పరంగా సీట్లు భర్తీ చేస్తామని చెప్పారు. అలాగే 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన వారు 15వ తేదీలోగా చేరాలని సూచించారు.

యువకుడికి గాయాలు



గాయపడిన రాజశేఖర్‌రెడ్డి

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో విద్యుత్ స్తంభం పైనుంచి పడి రాజశేఖర్‌రెడ్డి అనే యువకుడు గాయపడ్డాడు. కాంట్రాక్టు వర్కరుగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌రెడ్డి విద్యుత్ సరఫరా నిలిపివేసి స్తంభంపై పనిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. కిందకుపడి స్పృహ కోల్పోవడంతో గ్రామస్తులు వెంటనే వైద్య పరీక్షల కొరకు గుంతకల్లు వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి

కర్నూలు(హాస్పిటల్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మాస్ మీడియా అధికారి ప్రమీలాదేవి చెప్పారు. మంగళవారం స్థానిక కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్‌లో యూపీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమీలాదేవి మాట్లాడుతూ ఆశా డేకు సంబంధించిన అజెండా గురించి వివరించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డయేరియా గురించి అవగాహన కల్పించారు. 18 నుంచి 22 వారాల హైరిస్క్ గర్భిణులకు టిఫా స్కాన్ కోసం ఆరోగ్యశ్రీ ఎన్ ప్యానెట్ ఆసుపత్రులకు వైద్యాధికారి సూచనలతో రెఫర్ చేయాలని చెప్పారు. తీవ్ర రక్తహీనత గల గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తమార్పిడి చేసేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఉచిత రవాణా సౌకర్యం గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్–ఎ ద్రావణం పంపిణీ, నవజాత శిశుసేవల వివరాలను క్రమం తప్పకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. గర్భిణులకు 4వ నెల నుంచి ప్రసవానంతరం బిడ్డకు ఒక సంవత్సరం వచ్చే వరకు మాతాశిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కోసం కిల్కారి మెసేజ్‌ల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. లింగ వివక్షత నిర్మూలన, గర్భస్థ లింగనిర్ధారణ వ్యతిరేక చట్టం, ఆడపిల్లల ప్రాముఖ్యత, తాత్కాలిక గర్భనిరోధక పద్ధతుల గురించి ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుప్రియ, డాక్టర్ ఫర్వీన్ తబసుం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, పీసీ పీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

- బ్యాంకుల ప్రతినిధుల పేరిట వాట్సాప్ మెసేజ్‌లు
- డబ్బు గెలుచుకున్నారని ఫోన్ చేసి ఆశ చూపుతున్న కేటుగాళ్లు
- యువకులకు న్యూడ్ వీడియో కాల్స్

సైబర్ నేరగాళ్ల వల!



పత్తికొండ రూరల్ : నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరికి సెల్‌ఫోన్ తప్పనిసరి అయ్యింది. ఇంకోవిధంగా చెప్పాలంటే జీవితంలో భాగమైంది. ఈ అవకాశాన్ని సైబర్ నేరగాళ్లు వాడుకుంటున్నారు. గత కొన్నిరోజుల నుంచి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ ఏదో ఒక రూపేణా డబ్బు ఆశ చూపించి ప్రజలకు ఆశల వల విసురుతున్నారు. సైబర్ కేటుగాళ్ల మాయమాటలకు అమాయకులేకాదు... మేధావులు సైతం మోసపోతూనే ఉన్నారు. 'మీరు నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.9,980లు రివార్డు గెలుచుకున్నారు. ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి... వెంటనే మీకు అకౌంటుకు రివార్డు సొమ్ము జమ చేయబడుతుందని ఒక మెసేజ్'.. ఇలా పలు వాట్సాప్ గ్రూపుల్లో సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల అకౌంటు నుంచి సొమ్మును కాజేసేందుకు వల విసురుతున్నారు. మరికొందరికి ఏకంగా ఫోన్ చేసి ఆధార్‌కార్డు నెంబరు, డెబిట్ కార్డు వివరాలు, పిన్ నెంబరు లాంటి వివరాలు అడుతూ మాయమాటలు చెప్పి ఖాతాలు ఖాళీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ మెసేజ్ వెనుక ఎలాంటి మోసం దాగుందో తెలియక సెల్‌ఫోన్ వినియోగదారులు పరేషాన్ అవుతున్నారు. గత నెలలో కూడా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మండలంలోని కొందరు అమాయక యువకుల అకౌంటులో సొమ్ము రూ. లక్షల్లో మాయమైంది. కొందరు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తుండగా మరి కొందరు తాము మోసపోయిన ఈవిషయం బయటకు తెలిస్తే నలుగురిలో నవ్వులపాలవుతామని గమ్మున ఉంటున్నారు. కొందరు యువతులు యువకులకు న్యూడ్ వీడియో కాల్స్ చేసి వలపు వల విసురుతున్నారు. మాయమాటలతో మభ్యపెడుతున్నారు. ఆ తర్వాత వారితో మాట్లాడిన శృంగార సంభాషణ, వీడియో ద్వారా చిత్రీకరించి వారికే వాట్సాప్ ద్వారా పంపించి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. ఈవీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి మిమ్మల్ని బజారుకి లాగుతామని బెదిరించి డబ్బు లాగుతున్నారు. ఇలా సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకూ శృతిమించిపోతున్నాయి. సైబర్ నేరగాళ్ల నియంత్రణకు పోలీసు అధికారులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బులెవరికీ ఊరికే రావు

ముఖ్యంగా డబ్బులెవరికీ ఊరికే రావు అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటే అంతే సంగతులు. ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయి. వాట్సాప్ ద్వారా వచ్చిన వివిధ బ్యాంకుల పేరుతో తప్పుడు సందేశాలను నమ్మవద్దు. ఏబ్యాంకు నుంచి ఎవరూ ఫోన్ చేసి ఏటీఎం కార్డు పిన్ నెంబరు చెప్పమని అడగరు. ఫేక్ యాప్‌లను ఎవరూ డౌన్‌లోడు చేసుకోవద్దు. ఈవిషయాన్ని అందరూ గమనించాలి. డబ్బు ఆశ చూపించే వారి మాయమాటలు నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– మురళీమోహన్, సీఐ, పత్తికొండ

ఇలా ఉంటే నడిచేదెలా?





బురదమయంగా మారిన కరిమద్దెల ప్రధాన రోడ్డు

గడివేముల: మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో చిన్నపాటి వర్షానికే గ్రామంలోని రహదారులు బురదమయంగా మారుతున్నాయి. వర్షపునీరు పోవడానికి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిల్వ ఉంటోంది. గ్రామంలోకి ప్రవేశించిన ప్పటి నుంచి చివరి వరకు నీరు నిల్వ ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయటకు వెళ్లాలంటే బురదలో నడవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ప్రధాన రహదారుల్లో సైతం వర్షపు నీరు నిల్వ ఉండి దుర్గంధం వ్యాపిస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలకు వినతి



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యసేవలు మెరుగుపరచాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డికి సీపీఎం నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శివర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ క్యాజువాలిటీలో పడకల సంఖ్య పెంచాలని, అదనపు గదులను కేటాయించాలని కోరారు. క్యాజువాలిటీ వద్ద స్ట్రెచ్చర్ల సంఖ్యను పెంచాలని, ప్రతి బ్లాక్‌లో పాడైపోయిన మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో వార్డు బాయ్‌ల సంఖ్యను పెంచాలని కోరారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీగార్డులు, స్వీపర్లకు ఒప్పందం ప్రకారం జీతాలు ఇవ్వాలని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ నిధులను కార్మికుల ఖాతాలో జమచేయాలని, ఈ మేరకు కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం కార్యదర్శి వర్గసభ్యులు కేపీ నారాయణ, కార్యదర్శి ఎం. రాజశేఖర్ ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

- ప్రభుత్వాసుపత్రి, మెడికల్ కాలేజీ, హాస్టల్ వద్ద కొత్తగా నాలుగు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



కర్నూలు మెడికల్ కాలేజీ ఎదురుగా స్పీడ్ బ్రేకర్లు వేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



కర్నూలు మెడికల్ కాలేజీ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయడంతో నిదానంగా వెళ్తున్న వాహనాలు

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వాసుపత్రి నుంచి మెడికల్ కాలేజీ హాస్టల్‌కు వెళ్లే దారిలో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆసుపత్రికి రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. మందులు, వివిధ అవసరాల కోసం రోడ్డు దాటుతుంటారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవలమెడికల్ కాలేజీ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వైద్య విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని వాహనాల అతి వేగానికి కళ్లెం వేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం ప్రభుత్వాసుపత్రి వద్ద, మెడికల్ కాలేజీ వద్ద, మెడికల్ కాలేజీ హాస్టల్ వద్ద రోడ్డుపై మొత్తం నాలుగు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



కల్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



గూడూరు: మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కల్లూరు: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్లు రఘు, నవీన్ అన్నారు. మంగళవారం మలేరియా మాసోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో డ్రైనేజీ కాలువలు, నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు, లార్వాలు పెరిగే అవకాశం ఉందన్నారు. దోమ కాటు వల్ల మలేరియా వ్యాపిస్తుందని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రమ్ములు, గచ్చులు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మాసపోగు నాగరాజు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

గూడూరు రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలపై ఉందని వైద్యాధికారిణి ప్రత్యూష అన్నారు. గూడూరు పట్టణంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో ప్రజలు ఎక్కువగా డయేరియాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోరాదని తెలిపారు. డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ రామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ రాఘవయ్య, ఏఎన్ఎంలు దుర్గా, చిట్టెమ్మ, శేషమ్మ, గిరిజ, శ్రీలక్ష్మి, పార్వతమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



వర్కూరులో బోరుబావి కింద ఉల్లినాట్లు వేస్తున్న కూలీలు

జోరుగా ఉల్లి నాట్లు

కోడుమూరు రూరల్: మండలంలో ఉల్లి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని వర్కూరు, పులకుర్తి, ప్యాలకుర్తి, గోరంట్ల గ్రామాల్లో బోరుబావుల కింద రైతులు జోరుగా ఉల్లి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఉల్లికి డిమాండ్ పెరుగుతుండడంతో చాలామంది రైతులు ఉల్లి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.